సాక్షి ఒడిశా
బుధవారం । 14 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.97,560 వచ్చాయని అధికారులు వెల్లడించారు.

పనులు పరిశీలన

పర్లాకిమిడి: స్థానిక రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు మంగళవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న కొత్త రైల్వేస్టేషన్ కార్యాలయం పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు కాశీనగర్ మాజీ చైర్మన్ చిత్రి సింహాద్రి, బీజేపీ సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

దొరాగుడ ఐఐసీగా సుగ్యాని సాహు



రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి దొరాగుడ పోలీసుస్టేషన్ ఐఐసీగా సుగ్యాని సాహు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఆమె మునిగుడ పోలీసుస్టేషన్‌లో ఐఐసీగా విధులు నిర్వహించారు. ఇక్కడ విధులు నిర్వహించిన దేవ్ మల్లిక్ అంద్రాకంచ్ ఐఐసీగా బదిలీ అయ్యారు. సుగ్యాని బాధ్యతలు స్వీకరించడంతో సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



బోల్తాపడిన ట్రక్కు

జయపురం: బొయిపరిగుడ సమితి లొంగలపకన గ్రామ ఘాట్ రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. విజయవాడ–రాంచీ జాతీయ కారిడార్‌లో రేకుల లోడుతో మల్కన్‌గిరి వెళ్తున్న ఒక ట్రక్కు అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో అటువైపుగా వస్తున్న స్కార్పియోలో ట్రక్కును ఢీకొని ఘాట్ రోడ్డు కిందకు జారి పడింది. ప్రమాదంలో ట్రక్కు డ్రైవర్ ఎస్.చందు తలకు బలమైన గాయమైంది. అలాగే హెల్పర్ ఎస్.పవన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అదేవిధంగా లోయలోకి జారిపడిన వాహనంలో పయనిస్తున్న ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొందరిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ రవికుమార్, దుర్గా ప్రసాద్, శ్రీనివాస రెడ్డి, హనీఫ్‌లుగా గుర్తించారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే బొయిపరిగుడ ఏఎస్ఐ శివశంకర నాయిక్ హుటాహుటిన వెళ్లి, గాయపడినవారిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. హనీష్ తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం కొరాపుట్‌కు తరలించారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో దాస్

రాయగడ:

జిల్లాలోని కాసీపూర్‌లో ఈనెల 9వ తేదీన చోటుచేసుకున్న హత్యకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్‌డీపీవో దేవజ్యోతి దాస్ కాసీపూర్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో వివరాలను మంగళవారం వెల్లడించారు. అరెస్టైన వ్యక్తులు చంద్రగిరి పంచాయతీకి చెందిన భాగో గౌడొ (54), అతని ఇద్దరు కొడుకులుగా తెలియజేశారు. ఆరోజు ఉదయం రాజేంద్ర నాయక్ (54) అనే వ్యక్తి కాసీపూర్‌కు సమీపంలోని సికరాడ గ్రామంలో ఉన్న తన పొలానికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించి భాగొ గౌడొ, అతని ఇద్దరు కొడుకులు నాయక్‌పై దాడిచేసి హత్య చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్టు చేసినట్లు తెలియజేశారు. వీరిమధ్య గత కొన్నేళ్లుగా భూ తగాదాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని వెల్లడించారు.

ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి



వినతిపత్రాలతో 108 ఉద్యోగులు

మల్కన్‌గిరి:

ప్రభుత్వ 108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న తమకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వా లని సిబ్బంది కోరారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి ప్రపుల్ల కుమార్ నాందోకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రమాదాలు, ప్రసవాలు, కరోనా సమయంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న తమకు తగిన గుర్తింపు లేదన్నారు. అంబులెన్స్ డ్రైవర్లకు రూ.25 వేలు, అటెండర్స్‌కు రూ.35 వేలు, ఈఎంటీకు రూ.30 వేలు చొప్పున వేతనాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఏదైనా ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్లు మృతి చెందితే వారి కుటుంబాలకు రూ.20 లక్షలు ఇవ్వాలన్నారు. అలాగే పని సమయం రోజుకు 8 మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు.

లలితా దేవీ నమోస్తుతే..!

స్థానిక పొడుగు కోవెల వీధిలో లలితా దేవి ఆలయ ఐదో వార్షికోత్సవ వేడుకలు వైదిక బ్రాహ్మణ గోపాల శర్మ, సంతోష్ శర్మ, నందనందన శర్మ ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి రుద్రాభిషేకం, షోడశోపచార పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళల కోలాటంతో తిరువీధి ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో బరాటం నాగేశ్వరరావు, అంధవరపు బాలాజీ, ఊనా వేంకటేశ్వర్ల దంపతులు, విశాలాక్షి అయ్యంగర్, దుర్గా ప్రసాద్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. – పర్లాకిమిడి



హోమం నిర్వహిస్తున్న దృశ్యం



లలితా దేవికి రుద్రాభిషేకం

ప్రగతి పథంలో దేశం పయనిస్తోంది

- బీజేపీ జాతీయ సాధారణ కార్యదర్శి పురందేశ్వరి
- ఒడిశాలో రెండు రోజుల పర్యటన



రాయగడ: పురందేశ్వరికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

జయపురం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం ప్రగతి పథంలో పయనిస్తోందని బీజేపీ జాతీయ సాధారణ కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తన రెండు రోజుల కొరాపుట్ జిల్లా పర్యటన సందర్భంగా సోమవారం సాయంత్రం జయపురం బీజేపీ కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతికి తావులేకుండా ప్రజా రంజకంగా పాలన సాగుతోందన్నారు. ఆర్థిక రంగంలో మోదీ పాలన ముందుకు సాగుతోందన్నారు. పేద ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. రూ.1 కే కేజీ బియ్యం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన తదితర పథకాలు తమ పథకాలుగా రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పుకుంటున్నాయని ఆరోపించారు. పేదలకు ఇళ్ల సమకూర్చేందుకు కేంద్రం నిధులు అందజేస్తుంటే, ఆ పథకానికి ఒడిశా ప్రభుత్వం బిజూ ఆవాస్ యోజన పేరు పెట్టుకుందని మండిపడ్డారు. జిల్లాకు రెండు రైలు ప్రాజెక్టులు మంజూరు చేసి ఏళ్ల గడుస్తున్నా, అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చకపోవడంతో నేటికీ జయపురం- మల్కన్‌గిరి, జయపురం–నవరంగపూర్ రైలు మార్గాల పనులు జరగడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం భారత మాల జాతీయ రహదారిని నిర్మిస్తోందని, ఈ మార్గం రాయపూర్ నుంచి నవరంగపూర్, కొరాపుట్ జిల్లాల మీదుగా విశాఖపట్నం వెళ్తుందన్నారు. ఈ రహదారి వలన ప్రజలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధి కేంద్ర ప్రభుత్వం పలు సౌకర్యాలు కల్పిస్తోందని, కొరాపుట్, రాయగడ జిల్లాల్లో ఏకలవ్య పాఠశాలలు కేంద్రం నెలకొల్పిందని, కొరాపుట్‌లో కేంద్ర విశ్వవిద్యాలయం స్థాపించామని వెల్లడించారు. సాగునీటి వనరులు విస్తృత పరచేందుకు కేంద్రం సహకరిస్తూ వస్తోందన్నారు. సమావేశంలో కొరాపుట్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుమంత ప్రధాన్, నవరంగపూర్ మాజీ ఎంపీ బలభద్ర మఝి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్ తదితరులు పాల్గొన్నారు. అయితే సాయంత్రం 4 గంటలకు జయపురం బీజేపీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహిస్తారని తెలియజేశారు. కానీ ఆమె సాయంత్రం ఆరున్నర గంటలకు రావడంతో రెండున్నర గంటల ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది.

రాయగడలో...

రాయగడ: బీజేపీ జాతీయ సాధారణ కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి మంగళవారం రాయగడ చేరుకున్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆమెకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, భారతీయ మైనారిటీ మోర్చా రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాలీరాం మఝి తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో పార్టీ నాయకులతో సమావేశమవుతున్నామన్నారు. కొరాపుట్ లోక్‌సభ స్థానం పరిధిలోని కొరాపుట్, ధమన్‌జొడి, జయపురం రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు కేంద్రం నిధులు మంజూరు చేసిందని, ఇప్పటికే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలియజేశారు. ముఖ్యంగా రాయగడను రైల్వే డివిజన్‌గా గుర్తించి ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం, ఆ దిశగా రాయగడను అభివృద్ధి చేసేందుకు విశేషంగా కృషి చేస్తోందన్నారు.



జయపురం: మాట్లాడుతున్న పురందేశ్వరి

లక్ష్మీపూర్‌లో పర్యటన

కొరాపుట్: జిల్లాలోని లక్ష్మీపూర్ సమితి కేంద్రంలో పురందేశ్వరి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న గిరిజనులతో మమేకమయ్యారు. అంతకుముందు కొరాపుట్ జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. జిల్లాస్థాయిలో బీజేపీతో పాటు దాని అనుబంధ విభాగాల్లో పనిచేస్తున్న వారితో సంభాషించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఆమెతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు సుమంత్ ప్రధాన్, నబరంగ్‌పూర్ మాజీ ఎంపీ బలభద్ర మఝిలు ఉన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



మృతదేహాన్ని చూసి ఆవేదనలో గ్రామస్తులు

జయపురం: నాలుగు రోజుల క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన బొయిపరిగుడ సమితి దమంతపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గౌరచంద్ర ప్రధాని(55) నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతికినా జాడ తెలియలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం గ్రామస్తులు కొందరు సమీప అడవిలోకి కట్టెల కోసం వెళ్లగా దుర్వాసన రావడంతో, అటువైపు చూడగా చెట్టుకు ఒక శవం వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు గ్రామానికి వెళ్లి విషయాన్ని తెలియజేశారు. చెట్టుకు వేలాడుతున్న శవం ఎవరిదని ముందుగా గుర్తించలేకపోయారు. అయితే అతని దుస్తులు ఆధారంగా కుటుంబ సభ్యులు ఆ మృతదేహం గౌరచంద్ర ప్రధాన్‌దిగా గుర్తించారు. వెంటనే బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుర్తింపు రద్దు చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన భూమియ సమాజ్ ప్రతినిధులు

జయపురం: భూమియా ఆదివాసీ యువతులు ఇతర కులాల వ్యక్తులను పెళ్లి చేసుకుంటే వారికి ఆదివాసీ గుర్తింపు రద్దు చేయాలని జిల్లా భూమియ ఆదివాసీ సమాజప్రతినిధులు కోరారు. ఈ మేరకు గవర్నర్‌కు విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రాన్ని జయపురం సబ్ కలెక్టర్ బేదబర ప్రధాన్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవిభక్త కొరాపుట్‌లో భూమియ సాంప్రదాయ జాతి మహిళను ఎవరైనా సాధారణ వర్గం వారు పెళ్లి చేసుకుంటే వారు జీవితాంతం ఆదివాసీలుగానే ఉంటున్నారన్నారు. దీనివలన వివాహం చేసుకున్న వారు సైతం ఆదివాసీలు పొందుతున్న లబ్ధి పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పలువురు నకిలీ సర్టిఫికేట్లతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందుతున్నారని, అంతేకాకుండా రాజకీయ రంగంలో పదవులు పొందుతున్నారని దీనిపై దర్యాప్తు జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే స్వాతంత్ర్య సమరయోధుడు సహిద్ లక్ష్మణ నాయిక్ జన్మస్థలం తెంతులిగుమ్మలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామంలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక వైద్య కేంద్రం, బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. సబ్ కలెక్టర్‌ను కలిసినవారిలో సదన్ భూమియ, గణపతి నాయిక్, కైలాస చంద్ర భూమియ, బినాయక పూజారి తదితరులు ఉన్నారు.

ఐదుగురు దోపిడీ దొంగలు అరెస్టు



నిందితులను చూపిస్తున్న పోలీసులు



బాధితుడికి స్వాధీనం చేసుకున్న వస్తువులు అందజేస్తున్న పోలీసులు

బరంపురం: టౌన్ పోలీసుస్టేషన్ పరిధి తులసీనగర్ 8వ లైన్‌లో నివాసం ఉంటున్న సీహెచ్ భాస్కర్‌రావు చౌదరి ఇంట్లో జరిగిన చోరీలో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్పీ ఆశిష్ కుమార్ పండా తెలిపిన వివరాల మేరకు.. గత నెల 25వ తేదీన భాస్కరరావు ఇంటి గేటు తాళాలు బద్దలుగొట్టి నిందితులు ఇంట్లోకి చొరబడి, బంగారం ఆభరణలు, వెండి సామగ్రి, రూ.30 వేల నగదు దోచుకొని పరారయ్యారు. సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమేరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు నిర్వహించారు. దీనిలో భాగంగా ఐదుగురిని అరెస్టు చేసి వారి దగ్గర నుంచి 30.290 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో ఇర్ఫాన్ బాగ్, ఎస్‌కే హష్‌రప్, మహ్మద్ బాషీర్, ఎస్‌కే సమీర్, జాకిర్ హుషాన్లు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు బాధితుడికి అందజేసినట్లు పేర్కొన్నారు.

శభాష్ స్మృతి

- కేన్సర్ రోగుల కోసం జుట్టు దానం చేసిన యువతి



జుట్టు విరాళంగా ఇవ్వక ముందు



జుట్టు విరాళంగా ఇచ్చిన తర్వాత

కొరాపుట్: కేన్సర్ రోగుల కోసం తన పొడవైన జుట్టును దానంచేసి కొరాపుట్‌కు చెందిన యువతి ఔదార్యాన్ని చాటుకుంది. కొరాపుట్ జిల్లా కేంద్రానికి చెందిన స్మృతి సుధా సాహు భువనేశ్వర్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తూ, సివిల్స్ కోసం శిక్షణ పొందుతోంది. ఇటీవల కేన్సర్ పీడిత మహిళల సమస్యలు ఆమెను తీవ్రంగా ప్రభావితం చేశాయి. కేన్సర్ మహిళా రోగులకు కీమోథెరపీ నిర్వహించిన తర్వాత జుట్టు ఊడిపోతుంది. దీంతో వారికి విగ్గు అవసరం ఏర్పడుతుంది. ఇలాంటి మహిళల కోసం సోప్వ అనే స్వచ్ఛంద సంస్థ మహిళల నుంచి జుట్టును విరాళంగా సేకరిస్తుంది. దీంతో వెంటనే కేన్సర్ పేషెంట్లకు కనీస తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో స్మృతి ఆ సంస్థను సంప్రదించింది. సన్నిహితులు, సహచర విద్యార్థుల సమక్షంలో తన జుట్టును విరాళంగా అందజేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒడిశాలో సుమారు 50 వేల మంది కేన్సర్ బాధితులు ఉన్నారన్నారు. చికిత్స సమయంలో జుట్టు రాలిపోతే మానసికంగా వేదనకు గురవుతారని పేర్కొన్నారు. అలాంటి వారికి జుట్టు ఇవ్వడం వలన వేగంగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలియజేశారు. తన నిర్ణయం తల్లిదండ్రులకు చెబితే సగం జుట్టు కంటే, పూర్తిగా ఇవ్వాలని సూచించి మద్దతు తెలిపారని ఆనందం వ్యక్తం చేసింది.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి



సమావేశంలో ప్రజలకు అభివాదం చేస్తున్న కద్రక, పక్కనే అనిల్ తదితరులు

రాయగడ: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఆదివాసీ మహా సంఘం అధ్యక్షుడు అప్పలస్వామి కద్రక కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాలోని కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీలో కార్యకర్తలతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. రాయగడ శాసనసభ నియోజకవర్గంలోని అత్యంత కీలకమైన కాసీపూర్ సమితిలో ప్రజల అభిమానాన్ని చూరగొన్నట్లయితే, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడం ఖాయమని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అనిల్ జైన్, జయంత్ బైరాగు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా మిశ్రిత మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం సభ్యులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కోడూరు నారాయణరావును తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం మంగళవారం అందజేశారు. తమ ప్రధానమైన గ్రేడ్ పే రూ.4200 లకు పెంచాలన్నారు. దీనిపై దీర్ఘకాలికంగా 13 రోజుల పాటు సామూహిక సెలవుల్లో ఉన్నా, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పందించడం లేదని, దీనిని అసెంబ్లీలో ప్రశ్నించాలని అమలా సంఘం అధ్యక్షుడు ప్రసాద్ కుమార్ పాత్రో కోరారు. ఆయనతో పాటు శంకర్ లాల్ సోరెన్, బలదేవ్ రథ్, శిశిర్ పాణిగ్రాహి, లడ్డు దాస్ తదితరులు పాల్గొన్నారు.

270 కిలోల గంజాయి పట్టివేత



సీజ్ చేసిన వాహనాలు, నిందితులను చూపిస్తున్న పోలీసులు



పర్లాకిమిడి: బైక్ తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది

బరంపురం: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు గిరిసిలా చెక్‌పోస్టు వద్ద బరంపురం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి గీతాంజలి సాహు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయం గోశంతరా పోలీసుస్టేషన్ పరిధి ఆంధ్ర–ఒడిశా సరిహద్దు గిరిసిలా చెక్‌పోస్టు వద్ద అధికారులు ట్రక్, స్కార్పియో వాహనాలపై దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా 7 బస్తాల్లో తరలిస్తున్న 270 కిలోల గంజాయితో పాటు రెండు వాహనాలు స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అరెస్టు చేశారు.

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఒక బైక్‌లో గంజాయి శాంపిల్స్‌ను ఎక్సైజ్ పోలీసులు మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పెట్రోల్ బంక్ వద్ద రామగిరికి చెందిన ఒక యువకుడు పెట్రోలు పోయిస్తుండగా, గంజాయి వాసన వస్తుండడంతో సదరు పెట్రోలు బంకు ఉద్యోగి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో వెంటనే ఎక్సైజ్ సిబ్బంది బంక్ వద్దనున్న బైక్‌ను తనిఖీ చేయగా, సీటు కింద పెట్టిన గంజాయి శాంపిల్స్‌ను గుర్తించారు. అంతకుముందు గంజాయి బస్తాను నిందితుడు తరలించినట్లు పెట్రోలు బంకు వర్కర్లు చెబుతున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

క్లుప్తంగా

కూలిపోయిన ఆస్పత్రి గోడ


కూలిపోయిన పశుసంవర్ధకశాఖ ఎ.డి కార్యాలయం, ఆస్పత్రి గోడ

పాలకొండ రూరల్: పట్టణ పరిధిలోగల పశుసంవర్ధకశాఖ ఎ.డి కార్యాలయం, ఆస్పత్రి గోడ ఆకస్మికంగా కూలిపోయింది. మంగళవారం సిబ్బంది పనుల్లో ఉండగా ఉన్నట్లుండి భారీ శబ్దంతో గోడ పడిపోవడంతో అంతా పరుగులు తీశారు. కాలం చెల్లిన భవనం కావడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పేర్కొంటున్నారు. అయితే అదృష్ట వశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ క్రమంలో విద్యుత్ మీటర్, వైర్లు పాడవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు.

30 మద్యం సీసాల స్వాధీనం

దత్తిరాజేరు: అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం బాటిల్స్ పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ బూర్జవలస ఎస్సై రాజేష్ మంగళవారం తెలిపారు. షికారుగంజి గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు అదే గ్రామంలో గ్రామానికి చెందిన సదాశివరావును పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

జామిలో 140 మద్యం బాటిల్స్..

జామి: మండలకేంద్రం జామిలో పోలీసులు మంగళవారం 140 మద్యం బాటిల్స్ పట్టుకున్నారు. స్థానిక పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న రాజాన శ్రీనివాసరావు పాన్‌షాపులో మద్యం బాటిల్స్ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేశారు. మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని రాజాన శ్రీనివాస రావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

ఐదుగురు విద్యార్థులపై కేసు నమోదు

సాలూరు: తనపై దాడిచేశారని బాధితురాలైన బాలిక ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఐదుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, తమ స్నేహితుడిని ప్రేమించాలంటూ పట్టణంలోని ఓ అమ్మాయిని బెదిరించిన ఆ విద్యార్థి సహా, స్నేహితులు ఐదుగురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బొలెరో ఢీకొని ఏఎన్‌ఎంకు గాయాలు


చికిత్స పొందుతున్న ఏఎన్‌ఎంసరోజిని

పార్వతీపురం: పార్వతీపురం మండలం కవిటిభద్ర గ్రామానికి చెందిన ఏఎన్ఎం ఎం. సరోజినిని బొలెరో వాహనం ఢీకొట్టడంతో గాయపడింది. గంగాపురం సచివాలయంలో పనిచేస్తున్న ఆమె మంగళవారం ఉదయం ఆమె సచివాలయం నుంచి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి స్కూటీపై వస్తుండగా వెంకంపేట రెవెన్యూ పరిధిలో వెనుకనుంచి పార్వతీపురం వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సరోజని రోడ్డుపై పడిపోవడంతో పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు చికిత్సకోసం ఆమెను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

కొమరాడ: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల సమీపంలో ఎన్టీ ఆర్ విగ్రహం వద్ద 70 నుంచి 75 వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. ఈ సమాచారాన్ని కొమరాడ పోలీసులకు చేరవేయడంతో సంఘటనా స్థలానికి వచ్చిన ఎస్సై జగదీష్ నాయుడు మృతదేహాన్ని పరిశీలించిన స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. వారం రోజులుగా ఈ వృద్ధుడు చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ ఉండేవాడని, వివరాలు తెలియరాలేదని, ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందివ్వాలని ఎస్సై తెలియజేశారు.

శ్రీశ్రీ కళావేదిక జిల్లా కార్యవర్గం ఎంపిక

గుమ్మలక్ష్మీపురం: శ్రీశ్రీ కళావేదిక పార్వతీపురం మన్యం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.దేవానంద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు గౌరవ అధ్యక్షుడిగా రౌతు వాసుదేవరావు, గౌరవ సలహాదారుగా ఎస్.బాలకృష్ణ, మహిళా అధ్యక్షురాలిగా రెడ్డి పద్మావతి, ఉపాధ్యక్షులుగా తాడుతూరి వెంకటరమణారావు, ప్రధాన కార్యదర్శిగా శైలజ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్.హరగోపాల్‌తో పాటు కార్యదర్శులుగా బి.ఉమామహేశ్వర రావు, ఎస్.సూర్యనారాయణ, చల్లా చంద్రశేఖర్, వి.కొండలరావు, పి.శేషగిరిరావు, పి.నిర్మల్‌కుమార్‌లను ఎంపిక చేసినట్లు చెప్పారు. అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అయిన శ్రీశ్రీ కళావేదిక 21 ప్రపంచ రికార్డులు సాధించిన సంస్థ అని ఈ సందర్భంగా దేవానంద్ పేర్కొన్నారు.

దేవుడా..!


వీరఘట్టంలోని జగన్నాథస్వామివారు

వీరఘట్టంలో దేవదాయశాఖ భూమిలో సాగులో ఉన్న పూలతోట


రూ.కోట్ల ఆస్తులు ఉన్న పాలకొండ జగన్నాథ స్వామి వారి రథం ఇది

- జగన్నాథుడి భూముల దురాక్రమణ
- లీజు బకాయిలు చెల్లించని రైతులు
- దూపదీప నైవేద్యాలకూ కటకట..
- జగన్నాథుని ఆలయ స్థిరాస్తులు 104 ఎకరాలు
- పంట పొలాలను కౌలుకిచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహించని దేవదాయశాఖ అధికారులు

వీరఘట్టం/పాలకొండ: అందరికీ ఆపద్బాంధవుడని నమ్మే జగన్నాథస్వామి వారికే కొందరు ఎసరు పెడుతున్నారు. దేవుడి భూముల కౌలును సరిగా చెల్లించడం లేదు. కౌలు వసూలు చేయాల్సిన దేవదాయ శాఖ అధికారులూ మిన్నకుంటున్నారు. ఫలితం.. దేవుడి దూపదీప నైవేద్యాలకు కటకటలాడాల్సిన పరిస్థితి. వీరఘట్టం, పాలకొండలో ఉన్న జగన్నాథుని ఆలయాలకు చెందిన 104 ఎకరాల భూమిలో కొంత ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి...

వీరఘట్టం మండలం చిదిమి రోడ్డులో ఉన్న ప్రవేటు భూములను ఏడాదికి ఒక ఎకరా భూమిని రూ.35 వేలు నుంచి రూ.40 వేలుకు కొందరు కౌలుదారులు లీజుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. ఇదే రోడ్డులో కొంత దూరంలో వీరఘట్టం జగన్నాథ స్వామి ఆలయ భూములు సుమారు 24.5 ఎకరాలు ఉన్నాయి. వీటిని అధికారులు ఎకరా భూమికి రూ.6 వేల నుంచి రూ.8 వేలకు లీజుకు ఇచ్చారు. ఆలయం


సుమారు 50 ఎకరాల భూములు ఉన్న వీరఘట్టం జగన్నాథస్వామి ఆలయం

పరిధిలో వీరఘట్టం, పాలకొండ, వంగర మండలాల్లో సుమారు 50 ఎకరాలు పైబడి భూములు ఉన్నాయి. వాస్తవంగా అయితే లీజులు ఏడాది రూ.15 లక్షల వరకు రావాలి. కనీసం రూ.3 లక్షలు కూడా రావడం లేదు. లీజులు అంతంతమాత్రమే కావడమే దీనికి కారణం. ఆలయభూములపై వస్తున్న అరకొర రాబడి కూడా సక్రమంగా దేవుడికి చేరడం లేదు. మధ్యవర్తులు, లీజుదారులు తినేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

– పాలకొండ నగరపంచాయతీలో ఉన్న జగన్నాథస్వామి ఆలయానికి సుమారు 54 ఎకరాల మాన్యం ఉన్నట్టు దేవదాయశాఖ వద్ద ఉన్న రికార్డులు చెబుతున్నాయి. ఎంతో విలువైన ఈ భూములకు ఎకరాకు రూ.8 వేలు చొప్పున రూ.4.32 లక్షలు రావాల్సి ఉంది. అయితే, ఆ డబ్బులు కూడా సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆలయ నిర్వహణ భారంగా మారుతోంది. చివరకు ప్రభుత్వం ఇస్తున్న నిధులతో ఆలయ నిర్వహణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దేవుడి భూమే కదా..

మన పొలంలో సెంటు భూమి ఆక్రమణకు గురైనట్టు గుర్తిస్తే వెంటనే రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకెళ్తాం. సర్వే నంబర్ల వారీగా హద్దులు వేసి ఎన్ని అడ్డంకులు ఎదురైనా భూమిని మన చేతిలోకి తీసుకుంటాం. దేవుడి భూమే కదా.. మనకెందుకులే అనుకుంటున్నారో.. ఏమో.. వీరఘట్టం, పాలకొండ జగన్నాథస్వామి ఆలయాలకు ఉన్న సుమారు 104 ఎకరాల దేవదాయశాఖ భూములు కొన్ని ఆక్రమణల్లో ఉండగా, మిగిలిన వాటికి నామమాత్రపు లీజులు చెల్లిస్తున్నారు. ఫలితంగా ఆస్తులు ఉన్నా ఆదాయం లేక జగన్నాథుని ఆలయాల నిర్వహణ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.

భూముల పరిస్థితి ఇది..

వీరఘట్టం జగన్నాథస్వామి ఆలయానికి వీరఘట్టంలో 5 ఎకరాలు, సీఎస్ఆర్ పేటలో 24.50 ఎకరాలు, వెంకమ్మపేట వద్ద 2 ఎకరాలు, కంబరలో 2.5 ఎకరాలు, కుంబిడిలో 1 ఎకరా, కత్తులకవిటిలో 1.5 ఎకరాలు, వంగర మండలం శివ్వాంలో ఒక ఎకరా, పాలకొండ మండలం అవలంగిలో ఎకరా, మరికొన్ని ప్రాంతాల్లో మరో 12 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూములు లీజుకు తీసుకున్న కొంతమంది లీజుదారులు ఏటా పంటలను సాగు చేస్తూ ఫలసాయం పొందుతున్నప్పటికీ కొందరు కౌలుదారులు దేవదాయ శాఖకు లీజులు చెల్లించడం మానేశారు. గతేడాది ఖరీఫ్‌లో పంటలు పండలేదని, కొందరు ఈ ఏడాది లీజులు కూడా చెల్లంచలేదని అధికారులంటున్నారు. మరికొన్ని చోట్ల సొంత భూములుగా భావించి ఇంకొకరికి లీజులకు ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. పాలకొండలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో దేవుడు భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని భక్తులు అంటున్నారు. దేవదాయశాఖ అధికారులు స్పందించి జగన్నాథుని భూములను రక్షించాలని కోరుతున్నారు. బహిరంగ వేలం వేసి నిర్ణీత సొమ్ముకు కౌలుకు ఇవ్వాలని సూచిస్తున్నారు.

ప్రభుత్వ నిధులతోనే ఆలయ నిర్వహణ



ప్రభుత్వం ఇస్తున్న నిధులతో దేవుడికి దూపదీప నైవేద్యాలు చేపడుతున్నాం. వీరఘట్టం, పాలకొండలో ఆలయాలకు ఉన్న భూములపై లీజు బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు కట్టనివారిపై శాఖపరంగా చర్యలు తీసుకుంటాం. ఇకపై బహిరంగ వేలం వేసి దేవుడి ఆస్తులు పరిరక్షణ పటిష్ట చేర్యలు చేపడతాం.

– వి.రాధాకృష్ణ, ఈఓ, జగన్నాథస్వామి ఆలయం, పాలకొండ

పులి సంచరిస్తోంది.. జాగ్రత్త!


మక్కువ: మేళాపువలస గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్న ఫారెస్టు ఆఫీసర్ నారాయణరావు

మక్కువ: మండలంలోని కొండరేజేరు గ్రామ సమీపంలో సోమవారం రెండు ఆవులపై పులి దాడిచేసి హతమార్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మక్కువ ఫారెస్ట్ ఆఫీసర్ నారాయణరావు మంగళవారం మండలంలోని మేళాపువలస, ములక్కాయవలస, కాశీపట్నం, కొండరేజేరు, పాపయ్యవలస గ్రామాల్లో దండోరా వేయించారు. పులి సంచరిస్తోందని, ఈ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాత్రి వేళల్లో ఒంటరిగా తిరగరాదన్నారు. పులి కనిపించినా ఎదురుదాడిచేయరాదన్నారు. పులిపై దాడిచేస్తే చట్టరీత్యానేరమన్నారు. ఆరుబయట మూగజీవులను కట్టరాదన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ బీట్ అధికారులు, సహాయబీట్ అధికారులు పాల్గొన్నారు.

దుగ్గిసాగరం క్రషర్ సమీపంలో పులి పాదముద్రలు


దుగ్గిసాగరం క్రషర్ సమీపంలో పులి అడుగులు

సాలూరు: పట్టణ శివారులోని దుగ్గిసాగరం క్రషర్ సమీపంలో పులిపాదముద్రలు కనిపించడంతో క్రషర్ సిబ్బంది అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నెల 8న గుమడాం సమీపంలో పులి ఆవుపై దాడిచేసి హతమార్చిన అనంతరం క్రషర్ మీదుగా వెళ్లినట్టు అధికారులు భావిస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా భార్య పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం టీకులోవ గ్రామానికి చెందిన ఎస్.అనితకు భర్త వెంకటరమణ చిన్నచిన్న విషయాలకు తరచూ గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన ఆమె పురుగు మందు తాగేసింది. గమనించిన కుటుంబసభ్యులు డోకిశీల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది.

భార్య కాపురానికి రావడం లేదని భర్త..

పార్వతీపురం: భార్య కన్నవారి ఇంటినుంచి కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం బక్కుపేటకు చెందిన ఎం.రవీంద్రకుమార్‌కు 10ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన శ్రావణితో వివాహం అయింది. వారిద్దరి మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా శ్రావణి కన్నవారింటికి వెళ్లిపోయింది. తన భార్యను తీసుకురావడానికి రవీంద్ర కుమార్ మంగళవారం అత్తవారింటికి వెళ్లగా మద్యం మానేస్తే వస్తానని ఆమె తెగేసి చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన రవీంద్రకుమార్ ఇంట్లో ఉన్న టర్పన్‌టాయిల్‌ను తాగేశాడు. ఈ విషయం గమనించిన చుట్టు పక్కల వారు ప్రాథమిక చికిత్స అందించిన తరువాత పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రాణ దాతలు

- రక్తం ఇచ్చి ప్రాణాలు కాపాడి ఆపద్బాంధవులవుతున్న దాతలు
- మండు వేసవిలో సైతం స్వచ్ఛందంగా రక్తదానం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

జిల్లాలో రక్తసేకరణ వివరాలు	
సంవత్సరం	సేకరించిన రక్తం (యూనిట్లు)
2017-18	16, 747
2018- 19	20,194
2019-20	17, 758
2020-21	13,992
2021-22	16,686
2022-23	20,755
2023-24	3,943


రక్తం ఇస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్/రాజాం సిటీ: మనిషి మాత్రమే రక్తదానం చేసి ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడన్న వాస్తవం మేరకు దాతలు సకాలంలో స్పందించి రక్తదానం చేస్తున్నారు. గర్భిణుల ప్రసవ సమయంలో, శస్త్రచికిత్స చేసే సమయంలో, రక్తహీనత ఉన్న వారికి, కేన్సర్, తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా రోగులకు , రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్ర రక్తస్రావం అయిన వారికి రక్తం ఎక్కువగా అవసరం ఉంటుంది. రక్తాన్ని పరిశ్రమల్లో తయారు చేయలేరు. దాతలే రక్తదానం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం రక్తం అవసరాలు తీరుతున్నాయంటే అది దాతలే వల్లే. రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ఏటా జూన్ 14వ తేదీన ప్రపంచ రక్త దాతల దినోత్సవం నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం.

అరుదైన బ్లడ్ గ్రూపులు

ఎనెగిటివ్, బినెగిటివ్, ఎబి నెగిటివ్ బాంబే బ్లడ్ గ్రూప్, ఏబీ పాజిటివ్ అరుదైన బ్లడ్ గ్రూపులు. ఈ గ్రూపుల రక్తం కొంతమందికే ఉంటుంది. ఈ గ్రూప్‌ల రక్తం సకాలంలో దొరకకపోతే శస్త్రచికిత్సలు వాయిదా పడతాయి. అదేవిధంగా రోగుల ప్రాణం మీదకు కూడా వస్తుంది.

స్వచ్ఛందంగా రక్తం ఇస్తున్న దాతలు

సాధారణ గ్రూపులైన ఎపాజిటివ్, బిపాజిటివ్, ఒ పాజిటివ్ గ్రూపు రక్తం అందుబాటులో ఉంటుంది. అరుదైన ఎనెగిటివ్, బినెగిటివ్, ఒనెగిటివ్, ఏబీ నెగిటివ్ గ్రూపుల రక్త నిల్వలు తక్కువగా ఉంటాయి. అయితే నెగిటివ్ గ్రూపు గల రోగి బంధువులు తమ వారికి రక్తదానం చేయాలని కోరిన వెంటనే స్పందించి దాతలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేస్తుండడంతో వారిని పలువురు అభినందిస్తున్నారు.

రక్తదానానికి అర్హులు....

- అపోహలువీడి రక్తదానం చేయాలనుకునేవారు ఆరోగ్యంగా ఉండడంతోపాటు 18 నుంచి 60 ఏళ్ల లోపు వయసు, 50 కిలోల బరువు కలిగి ఉండాలి..
- హిమోగ్లోబిన్ శాతం 12.5 ఉండాలి.

చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా, ఇతర వ్యాధులు సోకిన వారు నయమైన తరువాత నాలుగు నుంచి ఆరు నెలల అనంతరం రక్తదానం చేయవచ్చు.

- రక్తదానం చేసేవారి నుంచి కేవలం 300 మిల్లీ లీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు.
- రక్తాన్ని సేకరించే ముందు వైద్యులు దాత ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు.


రాజాం సిటీ: జీఎంఆర్ ఐటీలో రక్తదాన శిబిరం (ఫైల్)

వీరు అనర్హులు....

- మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు రక్తం ఇవ్వకుండా ఉండాలి.
- కంటి జబ్బులు, కంటి కలక వంటివి ఉన్నప్పుడు రక్తదానం చేయవద్దు.

రక్తదానం వల్ల ప్రయోజనాలు

రక్తదానం అనేది ఒకరి ప్రాణాలను రక్షించడంలో సహాయ పడే గొప్ప దానం. అయితే కొందరు తాము రక్తదానం చేయడం వల్ల ఏదైనా అనారోగ్యం వస్తుందేమోనని సందేహిస్తారు. నిజానికి రక్తదానం చేయడం వల్ల దాతకు అనేక ప్రయోజనాలు ఉంటాయి.


బరువు తగ్గించవచ్చు

ఆరోగ్యకరమైన వ్యక్తులు సమయానుకూలంగా రక్తదానం చేయడం వారి బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. శరీరంలో సామర్థ్యం పెరుగుతుంది.

రోగనిరోధక శక్తి పెరుగుదల

వివిధ రకాల అనారోగ్య కారణాలను నివారించడానికి ఇమ్యునాలజీ కీలకం. రక్తదానం చేస్తూ ఉండడం వల్ల శరీరంలో ఏదైనా అనారోగ్య సమస్యను గుర్తించవచ్చు. రక్తం ఇవ్వడం వల్ల శరీరంలోని పాత రక్తం పోయి కొత్త రక్తం ఉత్పత్తి అవుతుంది. బ్లడ్ ప్లాస్మా కూడా పునరుజ్జీవం పొంది ల్యూకో సైట్‌ల పెరుగుదలలో సహాయపడుతుంది. ఈ ల్యూకోసైట్‌లు వివిధ అనారోగ్యాల నుంచి రక్షించే రోగనిరోధక కణాలు.కావున రక్తదానం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యం బాగుపడుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా రక్తదానం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. క్యాన్సర్ వ్యాధిని దూరం చేస్తుంది. మానసిక ఆరోగ్యాన్ని రక్తదానం మెరుగుపరుస్తుందని వైద్యులు చెబుతున్నారు.

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పది



అన్ని దానాలకన్నా రక్తదానం గొప్పది. రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తం ఇవ్వడం అభినందనీయం. రక్తదానం చేయడమంటే ప్రాణాలు నిలపడమే. వేసవిలో సైతం రక్తదానానికి ముందుకు రావడం గొప్ప విషయం. రక్తదాతలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్ఓ

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక పూల అలంకరణలో పైడితల్లి అమ్మవారు


తలపై ఘటంతో మహిళల


బాధ్యతలు చేపట్టిన దేవాదాయ శాఖ ఎ.సి అన్నపూర్ణను పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న పైడితల్లి ఆలయ ఈఓ, మాజీ ఎ.సి కేఎల్.సుధారాణి


సిల్వర్ జూబ్లీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువ జాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, దూసి శివప్రసాద్‌లు శాస్త్రోక్తంగా అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం అమ్మవారికి తీపిపదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావి చెట్లవద్ద దీపారాధన చేశారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పైడిమాంబ సిల్వర్‌జూబ్లీ పుస్తక ఆవిష్కరణ

శ్రీపైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవాసంఘం 25వ వార్షికోత్సవానికి సంబంధించి సిల్వర్ జూబ్లీ పుస్తకాన్ని లేడీస్ క్లబ్‌లో మంగళవారం ఆవిష్కరించారు. సంస్థ వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో నేతృత్వంలో ఆధ్యాత్మిక అంశాలతో కూడిన పుస్తకాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఆర్.సూర్యపాత్రో మాట్లాడుతూ అమ్మవారిపై రూపకల్పన చేసిన చిత్రానికి సంబంధించి వాయిస్ ఓవర్ చేయడానికి హైదరాబాద్ వెళ్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పండగకు అమ్మవారి చిత్రాన్ని భక్తులకు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటం వద్ద పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భీష్మ, బంగారు నాగప్రకాశ్, జి.వెంకటరెడ్డి, తాడిరాజు, సామవేదుల గీతా రాణి, కొమ్మ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయశాఖ ఎ.సిగా అన్నపూర్ణ

దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్‌గా టి.అన్నపూర్ణ నియమితులయ్యారు. గతంలో ఆమె విజయనగరం పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈఓగా పనిచేశారు. అనంతరం అనకాపల్లి నూకాలమ్మ తల్లి ఆలయ ఈఓగా, శ్రీకాకుళం అసిస్టెంట్ కమిషనర్‌గా ఎన్‌టీఆర్ జిల్లా ఎ.సిగా పనిచేసి, విజయనగరం బదిలీపై వచ్చారు. అందరి సహాయ, సహకారాలతో జిల్లాలో ఉన్న ఆలయాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఇప్పటివరకూ ఎ.సిగా పనిచేసిన కేఎల్.సుధారాణి నుంచి బాధ్యతలు స్వీకరించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

విజయనగరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కోర్సులలో 2 నుంచి 3 నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నామని విజయనగరం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నీలం గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లా కేంద్రం శివారు కొండకరకాం గ్రామం వద్ద ఉన్న కేంద్రియ గిరిజన విశ్వ విద్యాలయం, వీటీ అగ్రహారం, బీసీ కాలనీ వద్ద ఉన్న నేక్ శిక్షణ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లలో శిక్షణ అందజేస్తామన్నారు. కనీసం ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత సాధించి, 18 ఏళ్ల నించి 45 ఏళ్ల లోపు నిరుద్యోగ యువత ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతకు సర్వేయర్ కోర్సు రెండు నెలల పాటు అందిస్తామన్నారు. అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ కోర్సుకు ఎనిమిదో తరగతి ఆపైన చదివిన యువతకు మూడు నెలల కోర్సుపై శిక్షణ ఉంటుందన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు పదో తరగతి, హెల్పర్ మేషన్ కోర్సుకు ఐదో తరగతి ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9652515251, 7075342406, 9866564273, 9948127818 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

పైడి భీమవరం సిటీ హైవేని ఆనుకొని 20 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ భూమాత వారి SUDA అప్రూవడ్ కలిగిన భూమి శ్రీ లేఅవుట్‌లో ప్లాట్స్ అమ్మకమునకు 80% లోన్‌తో కలవు. ఫోన్: 89853 65159

[V-6161]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

గ్రామదేవత సన్నిధిలో హైకోర్టు జడ్జి



అసిరితల్లిని దర్శించుకున్న జస్టిస్ దుప్పల వెంకటరమణ, కుటుంబ సభ్యులు

పొందూరు: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ మంగళవారం స్వగ్రామం చినబొడ్డేపల్లిలో గ్రామదేవత అసిరి తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా గ్రామానికి చేరుకున్న జడ్జిని శ్రీకాకుళం ఫస్ట్ ఏడీఎం కె.రాణి, సర్పంచ్ బి.రమణ, మాజీ సర్పంచ్ బి.సత్యం, బంధువులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం సతీమణి సంధ్య, కుమార్తెలతో కుటుంబ సమేతంగా అసిరితల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి రోడ్డు, విద్యుత్ సౌకర్యం విషయమై పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ అధికారులతో చర్చించారు. న్యాయమూర్తిని శ్రీకాకుళం ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి, ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్సై లక్ష్మణరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

రూ.5.70 కోట్లతో కోర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు..

పొందూరు మండల కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సిబ్బంది నివాస సముదాయాల నిర్మాణానికి రూ.5.70 కోట్లు, పాలకొండ కోర్టు భవనం, నివాస సముదాయాల నిర్మాణానికి రూ.4 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారని జస్టిస్ దుప్పల వెంకటరమణ తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుబడిన మద్యం సీసాలతో అధికారులు

పొందూరు: లావేరు మండలం పాతకుంకాం గ్రామానికి చెందిన కె.సురేష్ స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మంగళవారం 84 మద్యం బాటిళ్లతో పట్టుబడ్డాడు. మద్యం బాటిళ్లను అక్రమంగా ఆటోలో తరలిస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్సై(పొందూరు ఎస్ఈబీ ఇన్‌ఛార్జి ఎస్సై) ఎన్ని చంద్రమోహన్ దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

● **టెక్కలి రూరల్:** టెక్కలి ఆర్టీసీ డిపో ఎదురుగా అక్రమ మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. చిన్నారి వెంకటరమణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 14 బీర్లు, 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



సవర ఢిల్లేశ్వరి (ఫైల్)

మందస: మండలంలోని హంసరాళి పంచాయతీ కొయిటాసాయి గ్రామానికి చెందిన సవర ఢిల్లేశ్వరి(19) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో పెరట్లో గల మామిడిచెట్టుకు ఉరి వేసుకుంది. సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక గిరిజనులు హుటాహుటిన హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే ఢిల్లేశ్వరి మరణించినట్టు వైద్యులు చెప్పారు. కుటుంబ వివాదాల కారణంగానే ఢిల్లేశ్వరి ఆత్మహత్య చేసుకున్నట్టు బంధువులు చెబుతున్నారు. మృతురాలి తల్లి సవర వాణిశ్రీ ఫిర్యాదు మేరకు మందస ఎస్ఐ ఎనుకోటి రవికుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి హరిపురం సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించారు. పెద్ద కుమార్తెకు వివాహం చేసిన ఢిల్లేశ్వరి తల్లిదండ్రులు హరికృష్ణ, వాణిశ్రీలు చిన్న కుమార్తెను చదివించి ప్రయోజకురాలిగా చేయాలనుకున్నారు. ఇంతలో ఆత్మహత్య చేసుకోవడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఆ నేత్రాలు సజీవం



కార్నియాను సేకరిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : గార మండలం శ్రీకూర్మంలో నివాసముంటున్న కె.నరసింహాచార్యులు(73) మంగళవారం సాయంత్రం మృతిచెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ముందుగా రెడ్‌క్రాస్‌కు విషయం తెలియజేయగా మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం సిబ్బంది చేరుకుని వృద్ధుని కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు అభినందించారు.

రక్తదాతా సుఖీభవ

- సామాజిక బాధ్యతగా రక్తదానం
- 17 ఏళ్లుగా రక్త సేకరణలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్
- ఇప్పటి వరకు 1.02 లక్షల యూనిట్ల రక్తం సేకరణ
- 1472 శిబిరాల ఏర్పాటు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



రక్తనిధి కేంద్రం, శ్రీకాకుళం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో సుదీర్ఘమైన జాతీయ రహదారి ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఎంతోమంది క్షతగాత్రుల వుతూ ఆస్పత్రుల్లో ప్రాణాపాయంలో కొట్టుమిట్టాడుతుంటారు. ఇలాంటి వారికి రక్తం అత్యసరమవుతుంది. అదే విధంగా, వివిధ శస్త్రచికిత్సల సమయంలో ఎంతోమందికి రక్తం అవసరం ఉంటుంది. ఇలాంటి సమయంలో అందరికీ గుర్తుకొచ్చేది బ్లడ్ బ్యాంకులే. సాటిమనిషికి సాయం చేయాలనే ఉన్నత ఆలోచనతో స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేస్తూ ఎంతోమంది రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం.

అపోహలు వీడాలి..

చాలా మందికి రక్తదానం అంటే భయం, అపోహలు ఉన్నాయి. వాస్తవానికి రక్తదాన ప్రక్రియలో కేవలం 300 మి.లీ. రక్తాన్ని మాత్రమే స్వీకరిస్తారు. సాధారణంగా మనిషిలో సరాసరి 5 లీటర్ల నుంచి 6 లీటర్ల రక్తం ఉంటుంది. అందులో 300మి.లీ. దానం చేయడం వల్ల ఎటువంటి ప్రమాదం జరగదు. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినపుడు లీటరు వరకు రక్తం పోతుంది. సుఖ ప్రసవంలో తల్లి 700 మి.లీ.రక్తం కోల్పోతుంది. అయినా బాలింత బలహీనపడదు. వీటన్నింటిపైనా అవగాహన కలిగి ఉంటే చాలావరకు అపోహలు తొలగిపోతాయి.

2006 నుంచి రక్త సేకరణ

- జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో మొదటిసారిగా రక్త సేకరణ చేసేందుకు రెడ్‌క్రాస్ ద్వారా 2006 మార్చిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేశారు. నాటి నుంచి 2023 మార్చి వరకు 1472 రక్తసేకరణ శిబిరాలు నిర్వహించి 1,02,755 యూనిట్ల రక్తసేకరణ చేశారు. 95,816 మంది వ్యక్తులకు రక్తాన్ని అందించారు.
- మొత్తం సేకరించిన యూనిట్లలో 30 శాతం ప్రభుత్వ ఆసుపత్రులకు ఉచితంగా ఆందించాల్సి ఉంది. మిగిలిన యూనిట్లను తలసేమియా, కేన్సర్, హెచ్ఐవీ పేషెంట్లు, పేద రోగులకు అందించాల్సి ఉంది.
- ఇక్కడ సేకరించిన రక్తంలో హెపటైటిస్ 'బి', 'సి', హెచ్ఐవీ, వి.డి., మలేరియా వంటి వ్యాధులను కలిగించే క్రిములు లేకుండా రక్తాన్ని పరిశుభ్రం చేస్తారు.
- జిల్లాలో పలువురు అభిమానులు తమ హీరో పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేస్తుంటారు. యువజన సంఘాలు, కళాశాల విద్యార్థులు, ఉద్యోగ సంఘాలు, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సత్యసాయి సేవా సంస్థలు ఇలా ఎందరో స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు.

శిబిరాలు పెంచుతున్నాం



ప్రతి ఏడాది రక్తదాన శిబిరాలు పెంచుతున్నాం. జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ తోపాటుగా మా వలంటీర్లు ప్రజల్లోకి వెళ్లి అవగాహన కల్పిస్తుండటం వల్ల సేకరణ బాగానే జరుగుతోంది. ఇంకా రక్తదాతల సంఖ్య పెరగాల్సి ఉంది.

– పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ చైర్మన్

బ్లడ్ కాంపొనెంట్ సెల్ ఏర్పాటు

జిల్లాలో రక్తనిల్వల కొరత నేపథ్యంలో 2016 నవంబర్‌లో బ్లడ్ కాంపొనెంట్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో సేకరించిన రక్తం నుంచి కాంపొనెంట్స్ వేరు చేసి నిల్వ చేస్తారు. పేషెంట్‌కు వైద్యుల సలహా మేరకు ఏ కాంపొనెంట్ అవసరమో దాన్ని ప్రత్యేకించి అందజేస్తుంటారు. దీని ద్వారా ఈ ఏడాది 3101 ప్యాకెట్ల రెడ్‌బ్లడ్ సెల్స్, 132 ప్యాకెట్ల ఎఫ్ఎఫ్‌పీఎస్, 485 ప్యాకెట్ల ప్లేట్‌లెట్స్ సేకరించి అందించారు. మొత్తం 9,803 ప్యాకెట్ల రెడ్ బ్లడ్ సెల్స్ సేకరించారు.

66 సార్లు రక్తదానం..



నేను ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తుంటాను. ఇప్పటి వరకు నేను 66 సార్లు రక్తదానం చేశాను. మొదట్లో రక్తం ఇవ్వడానికి జంకేవాడిని. ఓసారి రక్తదాన శిబిరంలో నాకంటే పెద్ద వయస్సులో ఉన్న మా మేనేజర్ రక్తదానం చేయడం చూసి స్ఫూర్తి పొందాను.

– చల్లా రమణమూర్తి, ఎస్‌బీఐ ఉద్యోగి

రక్తసేకరణ లక్ష్యం..



సామాజిక సేవగా రక్త సేకరణకు కృషి చేస్తున్నాను. రక్తదానం చేయడం తృప్తిగా ఉంటుంది. మరొకరి ప్రాణాలు కాపాడంలో ఆనందం ఉంటుంది. రక్తదానంపై అపోహలు వీడాలి. ఈ విషయంలో గ్రామీణ ప్రాంతాల యువతలో ఇంకా అవగాహన పెరగాల్సి ఉంది.

– పి.చైతన్య కుమార్, రెడ్‌క్రాస్ వలంటీర్, రాజాం

ఆగస్టు 15న..



రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేసిన తరువాత ఇప్పటివరకు 48 సార్లు రక్తదానం చేశాను. ప్రతి ఏడాది పెళ్లి రోజు, ఆగస్టు 15న తప్పనిసరిగా రక్తదానం చేస్తాను. అవసరమైన వారికి కూడా రక్తదానం చేస్తాను.

– మధుకల్యాణ్, మెడికల్ రిప్రజెంటేటివ్

అవగాహన కల్పిస్తూ..



1993లో మొదటిసారి రక్తదానం చేశాను. అప్పటి నుంచి ఎవరికి రక్తం అవసరమైనా రక్తం దానం చేస్తున్నారు. సంవత్సరానికి రెండు సార్లు దానం చేయడంతో పాటు అందరికీ అవగాహన కల్పిస్తున్నాను.

– శాసనపురి మధుబాబు, వ్యాపారవేత్త, పాతపట్నం

ఎవరు రక్తదానం చేయవచ్చు?

18 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులు ఉన్నవారు ముఖ్యంగా రక్తదానం చేయకుడదు. ఏడాదిలో నాలుగు సార్లు రక్తాన్ని దానం చేయవచ్చు.

ఎస్‌బీఐ వ్యాపారం రూ.57,506 కోట్లు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం పరిధిలో రూ.57,506 కోట్ల వ్యాపారం జరిగినట్లు ఎస్‌బీఐ డిప్యూటి జనరల్ మేనేజర్ (బిజినెస్ అండ్ ఆపరేషన్స్) పంకజ్‌కుమార్ తెలిపారు. ఇందులో మొత్తం డిపాజిట్లు రూ.32,104 కోట్లు (మార్కెట్ షేర్ 30 శాతం), అడ్వాన్సులు రూ.25,402 కోట్లు (మార్కెట్ షేర్ 25 శాతం) ఉన్నాయన్నారు. డీజీఎంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం విశాఖ జిల్లా సిరిపురం ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తమ పరిధిలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, బొబ్బిలి ప్రాంతాల్లో 297 బ్యాంకు శాఖలున్నాయని, 50 లక్షల మంది ఖాతాదారులున్నారని చెప్పారు. గృహ రుణాలు 35 శాతం, ఆటో రుణాలు 28 శాతం, వ్యవసాయ రుణాలు 36 శాతం, ఎస్ఎంఈ విభాగంలో 25 శాతం మార్కెట్ షేర్లతో ఎస్‌బీఐ ముందంజలో ఉందన్నారు. అంతే కాదు.. వ్యక్తిగత రుణాలు, మార్ట్‌గేజ్ రుణాలు, విద్యా రుణాలు, పంట రుణాలు, తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై రుణాలు, డ్వాక్రా రుణాలతో పాటు పీఎం ముద్ర యోజన, పీఎంఈజీపీ, కేవీఐసీ, కేవీఐబీ, పీఎం స్వానిధి, జగనన్న తోడు, టిడ్కో, వంటి ప్రభుత్వ పథకాలను కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సత్వరమే రుణాలు మంజూరు చేస్తున్నామని వివరించారు. కార్ లోన్లు గంటల వ్యవధిలోనే ఇస్తున్నామన్నారు. డిజిటల్ లావాదేవీల్లోనూ తాము అగ్రస్థానంలో ఉన్నామన్నారు. బ్యాంకు లావాదేవీలు సులభతరం చేసే యోనో యాప్‌ను పెద్ద సంఖ్యలో ఖాతాదార్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పారు. ఖాతాదార్లకు మరింత మెరుగైన సేవలందించేందుకు వారి నుంచి ఫీడ్ బ్యాక్‌ను తీసుకునే కార్యక్రమాన్ని కూడా చేపట్టామన్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా ఖాతాదార్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ బ్యాంకుల్లో రూ.2 వేల నోట్ల మార్పిడిలో ఖాతాదార్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని పంకజ్‌కుమార్ తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



ట్రోఫీ అందజేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, యువకులు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలం రాంపురం పంచాయతీ పెద్దబిడిమి గ్రామంలో జరుగుతున్న శ్రీబిడిమి చండేశ్వరి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. మొత్తం 45 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో నల్లబొడ్లూరు, పెద్దబిడిమి జట్లు మధ్య హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్ జరిగింది. 10 ఓవర్లలో పెద్దబిడిమి జట్టు 5 వికెట్లకు 110 పరుగులు చేయగా, నల్లబొడ్లూరు జట్టు 6 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసి విజేతగా నిలిచింది. మంత్రి అప్పలరాజు సొంత నగదుతో విజేత జట్టుకు రూ.22,222, రన్నర్ జట్టుకు రూ.15,555, షీల్డులు అందజేశారు. నల్లబొడ్లూరుకు జట్టుకు చెందిన బొడ్డు అజిత్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, సిరీస్ అవార్డు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, రాంపురం, బహడపల్లి, నారాయణపురం, సరియాపల్లి సర్పంచ్‌లు పొట్టి ధర్మారావు, బొడ్డు శాంతిప్రియ, బత్తిని తేజేశ్వర రావు, బత్తిని వెంకటరావు, డాక్టర్ వైఎస్సార్‌హెచ్‌యూ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు దున్న హరికృష్ణ, గొరకల కేశవరావు, బొడ్డు ఉమ(ఉదయ్), తెప్పల గున్నయ్య, తిమ్మల హరికృష్ణ, జుత్తు గణపతి, గున్నయ్య, మెట్టూరు రామారావు, తెప్పల రామారావు, నిర్వాహక కమిటీ ప్రతినిధులు తిమ్మల జీవన్, జుత్తు లింగరాజు, దున్న కూర్మారావు, లబ్బ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మందసలో ఆధ్యాత్మిక శోభ

మందస: మేజరు పంచాయతీ మందస మంగళవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామదేవత అన్నపూర్ణమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా మారువారం సంబరం, శ్రీవల్లీ దేవసేన సహిత శ్రీసుబ్రహ్మమణ్యస్వామి ఆలయ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. దేవరవీధి నుంచి గ్రామదేవతను పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కాళికా నృత్యం మధ్య అమ్మవారిని జెన్నాచెరువు వరకు తీసుకెళ్లారు. మహేంద్ర కళామండలి సంకీర్తనాలాపన, అన్నసమారాధన, తిరువీధుల ప్రదక్షిణ, విశ్వశాంతి హోమం ఘనంగా జరిగాయి.



అన్నపూర్ణమ్మతల్లిని ఊరేగిస్తున్న దృశ్యం

రాష్ట్రపతిని కలిసిన మందస గిరిజనులు



రాష్ట్రపతి ద్రౌపదిముర్ముతో సవర డొంబురు, సవర రామదాసు(సర్కిల్‌లో)

మందస: రాష్ట్రపతి ద్రౌపదిముర్మును కలిసే అవకాశం మందస మండలంలో ఇద్దరు గిరిజనులకు దక్కింది. చీపి పంచాయతీ బొందికరి గ్రామానికి చెందిన సవర రామదాసు, టంగరాపుట్టి పంచాయతీ టంగరాపుట్టి గ్రామానికి చెందిన సవర డొంబురు సోమవారం రాష్ట్రపతి ముర్మును కలిశారు. అటవీ ప్రాంతంలో జీవనం సాగిస్తున్న గిరిజనుల స్థితిగతులు, పంటలు, జీవన విధానం (పీవీటీజీ)పై దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన గిరిజనులతో ఆమె భేటీ అయ్యారు. ఐటీడీఏ సీతంపేట నుంచి 10మందిని ఎంపిక చేయగా.. మందస మండలం నుంచి వీరిద్దరు ఉన్నారు. అడవుల్లో జీవనం సాగిస్తున్న ఆదివాసీల అభ్యున్నతికి రాష్ట్రపతి ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీరిద్దరికి ప్రశంసాపత్రాలను రాష్ట్రపతి భవన్ అధికారులు అందజేశారు.

విజిలెన్స్ దర్యాప్తులో జాప్యమెందుకు?

- కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్



నందిగాంలో హౌసింగ్ విజిలెన్స్ అధికారులతో మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో టెక్కలి నియోజకవర్గంలో అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, వారి అనుచరులు చేసిన అక్రమాలపై ఆధారాలతో సహా విజిలెన్స్ అధికారులకు అందజేస్తే దర్యాప్తు విషయంలో మూడేళ్ల పాటు తాత్సారం చేస్తున్నారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. ఎవరిని రక్షించడానికి తాత్సారం చేస్తున్నారని, ఈ విషయంలో ఒక్కరినీ విడిచిపెట్టేది లేదని, విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేసి తరువాత కోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు. గత టీడీపీ హయాంలో తిత్లీ పరిహారంలో చోటు చేసుకున్న అక్రమాలు, బీసీ కార్పొరేషన్ రుణాల్లో అక్రమాలు, పీఏసీఎస్‌లో అవినీతి, కింజరాపు హరిప్రసాద్ ఆధ్వర్యంలో సింగిల్ టెండరింగ్‌లో నాసిరకమైన పనులు, హౌసింగ్ మంజూరులో అవకతవకలపై మూడేళ్ల క్రితం పేరాడ తిలక్ ఆధారాలతో సహా విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై హౌసింగ్‌లో చోటు చేసుకున్న అక్రమాలపై మరిన్ని వివరాలు కావాలని మంగళవారం సంబంధిత విజిలెన్స్ అధికారులు తిలక్‌ను ఆశ్రయించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ...తిత్లీ తుపాన్ పరిహారంలో అచ్చెన్నాయుడు సోదరుడు హరిప్రసాద్, ఆయన భార్య పేరిట అన్యాయంగా నందిగాం మండలంలో పరిహారం తీసుకున్నారని, సింగిల్ టెండరింగ్‌లో నాసిరకమైన పనులు చేశారని, బీసీ కార్పొరేషన్ రుణాల్లో పెద్ద ఎత్తున రుణాలు పంచుకున్నారని, స్థానికంగా లేని వారి పేర్లతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారని, తుఫాన్ తర్వాత విద్యుత్ స్తంభాలు వేయకుండా వేసినట్లు లక్షలాది రూపాయలు దోచుకున్నారని, టీడీపీ నాయకులు పినకాన అజయ్‌కుమార్, మల్లా బాలకృష్ణ తో పాటు మరి కొంత మంది కలిసి పెద్ద ఎత్తున బ్యాంకు రుణాల్లో అక్రమాలకు పాల్పడిన విషయమై ఆధారాలతో సహా విజిలెన్స్ అధికారులకు అందజేస్తే దర్యాప్తు విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్క టీడీపీ నాయకుడిని విడ్చి పెట్టేది లేదని ఆయన స్పష్టం చేశారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కవిటి: మండలకేంద్రం కవిటిలో స్థల సమస్యతో అపరిష్కృతంగానే మిగిలిపోయిన ఉపవిద్యుత్ కేంద్రం నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావులతో కలిసి మంగళవారం కవిటిలో రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులతో సంయుక్తంగా స్థల పరిశీలన చేశారు. ఏపీ విద్యుత్ శాఖ నిబంధనల మేరకు 40 సెంట్ల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని ఎంపికచేశారు. విద్యుత్‌శాఖకు భూమిని కేటాయించాల్సిందిగా పలాస ఆర్డీఓ తమరాల సీతారామ్మూర్తికి చైర్‌పర్సన్ సూచించారు. కార్యక్రమంలో కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ పీఎం తిలక్, పి.శేఖర్,బి నాగు, తహసీల్దార్ పి.శేఖర్, ఎంపీడీఓ పి.సూర్యనారాయణ, మండల సర్వేయర్ మల్లికార్జున పాణిగ్రాహి, వీఆర్‌ఓ ఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కత్తిపోట్లకు దారితీసిన ఘర్షణ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కాపు వీధిలో మంగళవారం రాత్రి యువకుల మధ్య తలెత్తిన వివాదం కత్తిపోట్లకు దారితీసింది. ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో పక్కకు ఎవరు వెళ్తారు అనే విషయమై ఇరువురూ ఘర్షణ పడ్డారు. అక్కడితో ఆగకుండా కత్తిపోట్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కాపు వీధికి చెందిన దేవేంద్ర జిన్నా, మణి, దుబ్బ కిశోర్, పాసీల ప్రవీణ్‌కుమార్‌లు గాయపడ్డారు. కిషోర్, దేవేంద్ర జిన్నాలను పలాస సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రి వార్డులోనే 11 గంటల పాటు మృతదేహం

- రిమ్స్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన
- సీఎస్ ఆర్ఎంఓ వైఖరే కారణమని ఉద్యోగుల ఫిర్యాదు



విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న పలు విభాగాల ఉద్యోగులు

శ్రీకాకుళం: పట్టణంలోని రిమ్స్ వైద్యశాలలో ఓ మృతదేహం 11 గంటల పాటు వార్డులోనే ఉన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం రాత్రి 7 గంటలకు డి.కృష్ణారావు (67) అనే వృద్ధుడు ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ మృతిచెందాడు. ఈయన్ను జూన్ 9న రిమ్స్‌కు తీసుకురాగా ఐసీయూ వార్డులో ఉంచి చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. 11వ తేదీ రాత్రి 7గంటల సమయంలో మృతి చెందగా సోమవారం ఉదయం 6గంటల వరకు మృతదేహాన్ని వార్డులోనే ఉంచేశారు. సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ శంకరరావు నిర్వాకం వల్లే ఇలా జరిగిందని రిమ్స్‌లో పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని తీసుకుని వెళతామని చెప్పినా ఆర్ఎంఓ నిరాకరించి మహాప్రస్థాన వాహనం వస్తే గాని తీసుకునివెళ్లవద్దని హెచ్చరించినట్లు మృతుని బంధువులు చెబుతున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలిస్తామని నర్సింగ్ సిబ్బంది చెప్పగా.. 'ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులే మహాప్రస్థానం వాహనాన్ని రానివ్వలేదని, వారి నిర్వాకం అందరి దృష్టికి వెళ్లాలంటే మృతదేహం వార్డులోనే ఉంచాలి' అని అనటంతో చేసేది లేక వార్డులోనే ఉంచాల్సి వచ్చిందని డ్యూటీ నర్సులు చెబుతున్నారు. వార్డులోనే 11 గంటల పాటు మృతదేహం ఉండటంతో మిగిలిన రోగులు, వారి బంధువులు బిక్కుబిక్కుమంటూ గడిపారని ఉదయం 6గంటల సమయంలో రోగులంతా రిమ్స్ అధికారులకు ఫిర్యాదు చేయటంతో మృతదేహాన్ని తరలించేందుకు ఆర్ఎంఓ అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా రిమ్స్ సలహామండలి చైర్మన్ వరుదు విజయ్‌కుమార్ మంగళవారం రిమ్స్‌కు రాగా ఆయనకు పలు విభాగాల ఉద్యోగులు ఆర్ఎంఓ తీరుపై ఏకరువు పెట్టారు. స్టాఫ్‌నర్సులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఎంఎల్‌ఓ, సెక్యూరిటీ సిబ్బంది ఆర్ఎంఓ తీరును, ఆయన వినియోగిస్తున్న అసభ్య పదజాలాలను విజయ్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆర్ఎంఓను పిలిచి పద్ధతి మార్చుకోవాలని సూచించారు. సెక్యూరిటీ, పారిశుధ్య పనుల పర్యవేక్షణను రెండో ఆర్ఎంఓగా ఉన్న డాక్టర్ సూర్యప్రకాశ్‌కు అప్పగించారు. ఇకపై భాష మార్చుకోకపోయినా, ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తించినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు.

తల్లి మరణం తట్టుకోలేక..

- మనస్థాపంతో పదిరోజుల వ్యవధిలో కుమారుడు మృతి
- ఆమదాలవలసలో విషాదఛాయలు



ప్రణయ్‌కుమార్(ఫైల్)



బొడ్డేపల్లి లత (ఫైల్)

ఆమదాలవలస: తల్లి మరణం తట్టుకోలేక తీవ్ర మనస్థాపంతో కుమారుడు మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన ఆమదాలవలసలో మంగళవారం చోటుచేసుకుంది. పట్టణ శివారులోని టింపని ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ బొడ్డేపల్లి వెంకట నారాయణరావు భార్య బొడ్డేపల్లి లత(51) ఈ నెల 2న అనారోగ్యంతో మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు ప్రణయ్‌కుమార్(28) డిగ్రీ పూర్తి చేశాడు. ఇతనికి తల్లితో అనుబంధం ఎక్కువ. ఎప్పుడూ ఆమెను విడిచిపెట్టి ఉండేవాడు కాదు. నిత్యం సేవలు చేస్తూ ఇంటి వద్దే ఉండేవాడు. ఒక్కసారిగా తల్లిదూరం కావడంతో బాగా కుమిలిపోయాడు. తల్లి మృతి చెందినప్పటి నుంచి ఎవరితో కలవకుండా ముభావంగా ఉండేవాడు. ఈ క్రమంలో ప్రణయ్‌కుమార్‌కు రెండు రోజుల క్రితం మెదడుకు సంబంధించిన సమస్య వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి చేయిదాటిపోయిందని వైద్యులు స్పష్టం చేశారు. దీంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకురావడంతో మంగళవారం ప్రణయ్ కుమార్ మృతిచెందాడు. పది రోజుల వ్యవధిలో తల్లీ కొడుకులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. ప్రస్తుతం వీరు ఆమదాలవలస మండలం కనుగులవలస గ్రామంలో నివాసం ఉంటున్నారు.